క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని కొత్తూరులో నిర్మిస్తున్న చాకలి ఐలమ్మ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) గురువారం పరిశీలించారు. ఆయన రాకను తెలుసుకున్న రజక సంఘం నాయకులు కమ్యూనిటీ హాల్ వద్దకు చేరుకుని ఎమ్మెల్యే ఆర్కేకు, కమిషనర్ నిర్మల్ కుమార్‌కు, వైఎస్సార్‌సీపీ నాయకులకు చాకలి ఐలమ్మ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అదనంగా నిధులు కేటాయించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో జేసీఎస్ కో ఆర్డినేటర్ ఈదులమూడి డేవిడ్‌రాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, మున్నంగి వివేకానందరెడ్డి, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్‌కుమార్, రజక సంఘ నాయకులు బొజ్జ సుబ్బారావు, తోట సుబ్బారావు, ఆంజనేయ వరప్రసాద్, తాడేపల్లి సాంబశివరావు, ఉండవల్లి దుర్గారావు, పార్థసారథి, ములంపాక శివ, తాళ్లూరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతుల ఆందోళన

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామంలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజిలో గత నెలలో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతులకు అండగా ఉంటామని పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకరరావు అన్నారు. గురువారం దుగ్గిరాల కోల్డ్ స్టోరేజ్ వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రమాదం జరిగి 33 రోజులు అవుతున్నా ఇంత వరకు విచారణ కమిటీ రిపోర్టు రైతాంగానికి అందించకపోవడం విచారకమన్నారు. కోల్డ్ స్టోరేజ్‌లో పసుపు భద్రపరిచిన రైతులు ఆందోళన చెందుతున్నారని, ప్రస్తుత పసుపు ధర క్వింటాకు 11,750 ఉందని, ఈ ధర ప్రకారమే యాజమాన్యం నష్టపోయిన పసుపు రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని అన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎం.వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ కోల్డ్ స్టోరేజ్‌లో జరిగిన అవకతవకలను బయట పెట్టి తక్షణమే రైతుల జాబితా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రెపు సూర్యనారాయణరావు మాట్లాడుతూ రైతులంతా రాజకీయాలకు అతీతంగా నష్టపరిహారం కోసం ఆందోళన చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో తెలుగు రైతు నాయకులు కళ్లం రాజశేఖరరెడ్డి, వేములపల్లి వెంకట రామయయ్య, కాజా వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాలరాజు, బసవయ్య, రామస్వామి, వై. బ్రహ్మేశ్వరరావు, ఎ. రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా కోసం ఏం కృషి చేశారు

మంగళగిరి: రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఏం కృషి చేశారని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. పలు సమస్యలు పరిష్కరించాలంటూ గురువారం ఏపీ సచివాలయ ముట్టడికి ప్రయత్నించిన షర్మిలను తాడేపల్లి పోలీసులు మంగళగిరి పట్టణ స్టేషన్‌కు తరలించారు. ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఉద్యోగులు మెట్రో ప్రాజెక్ట్, రాజధాని రైతుల నష్ట పరిహారం, ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్ట్, వైజాగ్ స్టీల్ ప్లాంట్ సమస్యలపై ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వాన్ని ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కావూరి సాంబశివరావు, గిడుగు రుద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళల స్వయం ఉపాధికి ప్రభుత్వం కృషి



తాడికొండ: మహిళల స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం అన్ని విధాలా ముందడుగు వేస్తుందని తుళ్ళూరు మండలం ఎంపీడీవో బి శివన్నారాయణ అన్నారు. తుళ్లూరులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో టైలరింగ్ శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అన్ని నియోజకవర్గాల్లో స్కిల్ హబ్స్‌ను ఏర్పాటు చేసి వాటి ద్వారా నైపుణ్య శిక్షణలు అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు కుట్టు మిషన్ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకటేశ్వరరావు, ఏపీ ఎస్ఎస్‌డిసి జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి ప్రణయ్, కో ఆర్డినేటర్ వెంకట్, ఎస్ఎసి ఇన్‌ఛార్జి జ్యోతిర్మయి, శిక్షకులు ఇందిర తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

- తాడేపల్లి పట్టణ, రూరల్ కార్యాలయం ప్రారంభోత్సవం
- బైక్‌ర్యాలీ నిర్వహించిన యువకులు
- వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి వచ్చిన ఎంపీ విజయసాయిరెడ్డి

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణ పరిధిలో క్రిస్టియన్‌పేట నవోదయ కాలనీలో వైఎస్సార్ సీపీ పట్టణ, రూరల్ కార్యాలయ ప్రారంభోత్సవం గురువారం రాత్రి నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల్లో నూతనోత్సాహం చోటుచేసుకుంది. నూతన పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, ప్రభుత్వ సలహాదారులు జూపూడి ప్రభాకర్, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా వైఎస్సార్ సీపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి, మున్నంగి వివేకానందరెడ్డి, పట్టణంలోని, తాడేపల్లి రూరల్‌లోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎంపీ విజయసాయిరెడ్డి తన కార్యాలయం నుంచి ముందు కారులో ప్రాతూరు, కుంచనపల్లి క్రాస్‌రోడ్ వద్దకు చేరుకుని అక్కడ దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి, సంక్షేమ పథకాల రథసారథి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, ప్రజా నాయకులు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యువకులు బైక్ ర్యాలీ నిర్వహించగా రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, నియోజకవర్గ సమన్వయ కర్త గంజి చిరంజీవిలు పాదయాత్రగా కార్యాలయానికి విచ్చేశారు. ఈ సమయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నూతనోత్సాహంతో మంగళగిరి గడ్డ -వైఎస్సార్ సీపీ అడ్డా, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయం అంటూ నినాదాలు చేస్తూ వారివెంట పాదయాత్ర కొనసాగించారు. ఎంపీ విజయసాయిరెడ్డి, ఇతర నాయకుల రాకను పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద మహిళలు పూల వర్షం కురిపించి, హారతులు ఇచ్చి గుమ్మడికాయలతో దిష్టి తీశారు. అనంతరం రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు అమరా నాగయ్య, జేసీఎస్ కో ఆర్డినేటర్ ఈదులమూడి డేవిడ్‌రాజు, మండల, పట్టణ ముఖ్య నాయకులు కత్తిక రాఘవరావు, కత్తిక మల్లికార్జునరావు (బుల్లబ్బాయి), మేకల సాంబశివరావు, మిరియాల రాంబాబు, బొక్కా ప్రసన్న (నాని), గేలయ్య, అప్పికట్ల సంపూర్ణ పార్వతి, ప్రకాష్, అనిల్, మహేష్, దామేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల రామ్‌నగర్‌కు చెందిన శాఖమూరి సురేష్ కొంతకాలంగా బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నియోజకవర్గ సమన్వయ కర్త గంజి చిరంజీవిలతో కలసి బాధితుడిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి రూ. 50 వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించి అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు, దుగ్గిరాల మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు శృంగారపాటి రత్నం, నాయకులు దాసరి వీరయ్య, ఆత్మకూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌కు కొత్త శోభ

మొక్కలు నాటిన అధికారులు

మంగళగిరి : నవ్యనగర అభివృద్ధిలో భాగంగా గౌతమ బుద్ధా రోడ్డును సుమారు రూ.10 కోట్ల నిధులతో విస్తరించి నూతన డివైడర్ ను నిర్మించిన విషయం విదితమే. ఇప్పటికే డివైడర్ మధ్యలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి దీపాలు సైతం అమర్చారు. అయితే తాజాగా గురువారం డివైడర్ మధ్య పచ్చదనాన్ని పెంపొందించే చర్యల్లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమానికి నగరపాలక సంస్థ అధికారులు శ్రీకారం చుట్టారు. గత రెండు రోజుల కిందట నగరపాలక సంస్థ అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)గౌతమ బుద్ధా రోడ్డు డివైడర్ మధ్యలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని వెంటనే చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే ఆర్కే సూచనల మేరకు స్పందించిన నగరపాలక సంస్థ అధికారులు నగరంలోని ఆర్ అండ్ బీ బంగ్లా వద్ద నుంచి చినకాకాని ఎన్నారై వైద్యశాల వరకు డివైడర్ మధ్యలో రంగు రంగుల పూల మొక్కలు నాటేందుకు శ్రీకారం చుట్టారు. ఇందు కోసం ప్రత్యేకంగా కార్మికులను నియమించి యుద్ధప్రాతిపదికన మొక్కలు నాటిస్తున్నారు. మరో నాలుగైదు రోజుల్లో గౌతమ బుద్ధా రోడ్డు డివైడర్ మొక్కలతో సరికొత్త శోభను సంతరించుకోనుంది.



గౌతమ బుద్ధా రోడ్డు డివైడర్ మధ్యలో మొక్కలు నాటుతున్న దృశ్యం

కార్యక్రమాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

నగరంలోని గౌతమ బుద్ధా రోడ్డు డివైడర్ మధ్యలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), నియోజకవర్గ సమన్వయ కర్త గంజి చిరంజీవితో కలసి పరిశీలించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా డివైడర్ మధ్యలో మొక్కలు నాటాలని కాంట్రాక్టర్‌కు ఎమ్మెల్యే ఆర్కే సూచించారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపాల నిర్మాణానికి రూ.8లక్షల విరాళం

మంగళగిరి: నగరంలోని పలు కల్యాణ మండపాల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) రూ.8లక్షల విరాళాన్ని అందజేశారు. నగరంలోని రాజీవ్ గృహకల్ప వద్ద నిర్మాణం వద్ద తుది దశకు చేరుకున్న రజక, పద్మశాలి కల్యాణ మండపాల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ఆర్కే తన సొంత నిధుల నుంచి రూ. 5లక్షల విరాళాన్ని గురువారం పట్టణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల చేతుల మీదుగా కాంట్రాక్టర్‌కు అందజేశారు. ఆయా కల్యాణ మండపాల నిర్మాణాలకు తాను ఇచ్చిన రూ.5లక్షలకు సంబంధించి ప్రభుత్వానికి బిల్లులు రికార్డు చేయవద్దని కార్పొరేషన్ కమిషనర్ నిర్మల్ కుమార్, ఇంజినీరింగ్ విభాగం అధికారులకు ఎమ్మెల్యే ఆర్కే సూచించారు. నగరంలోని పాత మంగళగిరి సీతారామస్వామి కోవెల వద్ద గౌడ కమ్యూనిటీ హాల్ షెడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే ఆర్కే రూ. 3లక్షల విరాళాన్ని గురువారం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుల చేతుల మీదుగా గౌడ సంఘ నాయకులకు అందజేశారు.



నిర్వాహకులకు విరాళాన్ని అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నిజమైన సంక్షేమ సేవకులు వలంటీర్లు



అవార్డులు పొందిన వలంటీర్లతో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి



వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు, ఎమ్మెల్యే ఆర్కే, గంజి చిరంజీవి

- వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)

మంగళగిరి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల ముంగిటకు తీసుకువెళుతున్న వలంటీర్లు నిజమైన సేవకులు అని, వారి సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) కొనియాడారు. నగరంలోని రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు కళా మండపంలో గురువారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించడం, అందులో తాను పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గత 2019 ఆగస్టు 15న ఆంధ్ర రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థను ప్రారంభించారని గుర్తు చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్య దేశంలో అందరూ సమానంగా చూడబడాలని, అందరికీ సమాన హక్కులు కల్పించబడాలనే ఉద్దేశంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేపట్టి రెండు పేజీల మేనిఫెస్టోను తయారు చేశారన్నారు. రాష్ట్ర ప్రజలు జగనన్నపై ఉమ్మకం ఉంచి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నారన్నారు. కులాలకు, మతాలకు, రికమండేషన్లకు, లంచాలకు తావు లేకుండా విధి విధానాలను రూపొందించి అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతోపాటు ఓసీలకు సైతం రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అందజేయాలనే ఉద్దేశంతో వలంటీర్ వ్యవస్థను, గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చిన విషయం మీ అందరికీ తెలిసిందేనన్నారు. ఈ రోజు మీరంతా సేవా రత్న, సేవా మిత్ర, సేవా వజ్ర అని విభజింపబడినప్పటికీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టిలో, పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న పేదల దృష్టిలో మీరందరూ సేవా వజ్రాలేనన్నారు. అర్హత కలిగిన ప్రతి పేదవాడి ఇంటికి వెళ్లి వలంటీర్లు పెన్షన్‌లు అందిస్తున్నారని, పేదల కళ్లలో ఆనందం, వారికి మీ పట్ల కలిగిన ప్రేమ, ఆప్యాయతలు ఎనలేనివన్నారు. సమసమాజం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రూపొందించిన విధి విధానాలను లంచాలు లేకుండా, కుల, మతాలు లేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ నేరుగా మీరే అందజేయడం అంటే రానున్న రోజుల్లో రాష్ట్రంలో, దేశంలో వలంటీర్ వ్యవస్థ ద్వారా పెనుమార్పులు రాజకీయ రంగంలో వస్తాయని తాను ఖచ్చితంగా చెప్పగలనన్నారు. ఒక్క ఎంటీఎంసీ పరిధిలోని వలంటీర్లకు ఇప్పటి వరకూ రూ.4 కోట్లు అందజేశామని, ఈ రోజు సుమారు రూ.1.20 కోట్లను అందజేశామని, వృత్తి పట్ల అంకితభావం కలిగి భవిష్యత్తులో జగన్‌మోహన్‌రెడ్డికి పూర్తిస్థాయిలో అండగా నిలబడాలన్నారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం తెచ్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, సమ సమాజ స్థాపనకు కృషి చేస్తున్న నిజమైన నాయకుడు జగన్ మోహన్ రెడ్డి మాత్రమేనని కొనియాడారు. వైఎస్సార్ సీపీ సమన్వయకర్త గంజి చిరంజీవి మాట్లాడుతూ కుల, మతాలకు, రాజకీయాలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకు తీసుకువెళుతున్న వలంటీర్లకు వందనాలు తెలిపారు. అనంతరం వక్తలు సేవా రత్న, సేవా మిత్ర, సేవా వజ్రలను సత్కరించి సర్టిఫికెట్లను, నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ మునగాల భాగ్యలక్ష్మి, ఎస్సీ కమిషన్ బోర్డు సభ్యులు కట్టిపోగు బసవరావు, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, డీసీపీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులు

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత వ్యవస్థల్లో పెనుమార్పులు తీసుకువచ్చి పేద ప్రజల జీవితాల్లో అనూహ్య మార్పునకు శ్రీకారం చుట్టారని, వారి జీవితాల్లో మార్పు వచ్చిందని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి అన్నారు. గురువారం తాడేపల్లి మండల, పట్టణ పరిధిలోని బైపాస్‌రోడ్‌లోని ఓ కల్యాణ మండపంలో వలంటీర్లకు నగర పాలక సంస్థ కమిషనర్ నిర్మల్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, డీఈ కృష్ణారెడ్డి, ఆర్వో మురళి ఇతర అధికారులతో కలసి సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులను అందజేసి సన్మానించారు. వారు మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రభుత్వ వైద్యులు, ఏఎన్ఎమ్‌లు, ఆశా వర్కర్లతోపాటు వలంటీర్లు ప్రజలకు ఎంతో సేవ అందించి ప్రజల ప్రాణాలు కాపాడారని అన్నారు. కరోనా సమయంలో కుటుంబ సభ్యులే దగ్గరకు వచ్చేందుకు భయపడుతుంటే వలంటీర్లు మేమున్నామంటూ వారి ఇంటికి వెళ్లి సేవలు అందించారని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు, కుంచనపల్లి మాజీ వైస్ సర్పంచ్ మేకల నాగయ్య, జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ ఈదులమూడి డేవిడ్‌రాజు, వైఎస్సార్ సీపీ పట్టణ రూరల్ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, మున్నంగి వివేకానందరెడ్డి, బీసీ సెల్ జిల్లా నాయకులు కత్తిక రాఘవరావు, కత్తిక మల్లికార్జునరావు (బుల్లబ్బాయి), తాడేపల్లి మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు ఎండి గోరే, మాచర్ల అబ్బు, నాయకులు ముదిగొండ ప్రకాష్, బాలసాని అనిల్, బత్తుల దాసు, అప్పికట్ల సంపూర్ణ పార్వతి, రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి, బొక్కా నాని, మేకా దామేష్‌రెడ్డి, గొడవర్తి శ్రీనివాసరావు, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

సేవ చేయడమే లక్ష్యం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు సేవ చేసేందుకు వలంటీర్లను నియమించారు. కొంత మంది రాజకీయ విమర్శలు చేస్తున్నారు. వారి గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు. ఏ ప్రభుత్వ హయాంలో మంచి జరిగిందో పేద ప్రజలకు తెలుసు.

– ముళ్లపూడి మౌనిక, మహానాడు

మాకు ఎంతో గౌరవం దక్కింది



వివాహం అనంతరం ఇంటికే పరిమితమైన మాకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వలంటీర్‌గా అవకాశం కల్పించారు. గౌరవ వేతనం ఇవ్వడంతోపాటు పేద ప్రజల్లో మాకు ఎంతో గుర్తింపు తీసుకువచ్చారు.

– పసుపులేటి సుకన్య, సుందరయ్యనగర్

పవర్ లిఫ్టింగ్ అకాడమీ నిర్మాణ పనుల పరిశీలన



మంగళగిరి: నగరంలోని తెనాలి రోడ్డు పంపు హౌస్ వద్ద నూతనంగా సుమారు రూ.40లక్షల నిధులతో నిర్మిస్తున్న గుమ్మడి పుల్లేశ్వరరావు మెమోరియల్ పవర్ లిఫ్టింగ్ అకాడమి నిర్మాణ పనులను గురువారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. ఈనెల 26వ తేదీ నాటికి అకాడమీ ప్రారంభోత్సవం చేసుకోవడానికి ఏర్పాట్లు చేయాలని, అకాడమీ ఆవరణలోని స్టేజికి ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టర్ షేక్ సాదియా ఆల్మస్ పేరును ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. నగర పాలక సంస్థ డీఈ ఎ.సత్యనారాయణ, ఏఈ కిషోర్, వైఎస్సార్ సీపీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, ఆకురాతి రాజేష్, కిషోర్ పాల్గొన్నారు.

డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు పోస్టులు ఇవ్వాలి

తాడేపల్లిరూరల్: డీఎస్సీ-1998లో క్వాలిఫైడ్ అయిన 1815 మంది అభ్యర్థులకు పోస్టులు ఇవ్వాలని డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు జి.మోహన్ రావు, డాక్టర్ వి.ఎం.సుహాసిని డిమాండ్ చేశారు. తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నపుడు పాదయాత్రలో డీఎస్సీ-98 అభ్యర్థులను కలసి అందరికీ న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని అన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత అసెంబ్లీలో 5887 ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి 4072 పోస్టులు మాత్రమే భర్తీ చేశారని అన్నారు. తక్షణమే మిగిలి ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి బొత్స సత్యనారాయణ డీఎస్సీ-98 క్వాలిఫైడ్ అభ్యర్థులందరికీ ఉద్యోగాలు ఇచ్చామని అన్నారని, ఆర్డర్ ఆఫ్ మెరిట్ పేరుతో ఓసీలకు మాత్రమే పోస్టులు ఇచ్చారని అన్నారు. కార్యక్రమంలో విశ్వరూపచారి, నాగేశ్వరరావు, పి.రమేష్, రామారావు, మేలి కోమలి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విద్యా విధానం ద్వారా విద్య ప్రపంచీకరణ

- భారత ప్రభుత్వ ఏఐసీటీఈ మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ చీఫ్ కో ఆర్డినేటింగ్ ఆఫీసర్ డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్
- వీఐటీ ఏపీలో ఘనంగా విటాప్ -2024 టెక్ ఫెస్ట్ ప్రారంభం

ఐనవోలు(తాడికొండ): జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) విద్య ప్రపంచీకరణను ప్రోత్సహిస్తుందని భారత ప్రభుత్వ ఏఐసీటీఈ మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ చీఫ్ కో ఆర్డినేటింగ్ ఆఫీసర్ డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్ అన్నారు. తుళ్లూరు మండలం ఐనవోలు వీఐటీ- ఏపీలో రెండు రోజులపాటు నిర్వహించతలపెట్టిన విటాప్ - 2024 టెక్ ఫెస్ట్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం భారతదేశాన్ని ఒక ప్రముఖ ప్రపంచ నాలెడ్జ్ హబ్‌గా నిలబెడుతుందన్నారు. వీఐటీ- ఏపీ విశ్వ విద్యాలయం తన అంతర్జాతీయ టెక్ ఫెస్ట్ విటాప్ ద్వారా విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలు గణనీయంగా పెంపొందించేలా అవకాశాలు కల్పిస్తుందనడంలో సందేహం లేదన్నారు. మరో గౌరవ అతిథి ఐబీఎం ఇన్నోవేషన్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ విఠల్ మద్యాల్కర్ మాట్లాడుతూ నేడు వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక ప్రపంచంలో మారుతున్న సాంకేతిక విజ్ఞానాన్ని సంపాదించడం విద్యార్థులకు అత్యవసరంగా మారిందన్నారు. సాంకేతికతలో నూతన ఆవిష్కరణలు వేగంగా చేయవచ్చని, విద్యార్థులు ప్రపంచ సవాళ్లను ఆవిష్కరించడానికి, సృజనాత్మకత, ఆవిష్కరణలు పెంపొందించడానికి సాంకేతిక విజ్ఞానం ఎంతో అవసరమన్నారు. వీఐటీ ఏపీ వీసీ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి మాట్లాడుతూ విటాప్-2024 సాంకేతికత, సృజనాత్మకతకు సంబంధించిన వేడుక అని విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి ఎంతగానో ఇది ఉపయోగపడుతుందన్నారు. టెక్ ఫెస్ట్ ద్వారా వివిధ కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, సంస్థల నుంచి విద్యార్థులు పోటీ పడేందుకు వారి సాంకేతిక పరిధులు విస్తరించేందుకు ఒక శక్తివంతమైన వేదికగా నిలుస్తుందన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్‌చంద్ర ముదిగంటి మాట్లాడుతూ ఈ టెక్ ఫెస్ట్ పోటీ మాత్రమే కాదు విద్యార్థులు నేర్చుకునేందుకు, ఎదిగేందుకు, నిరంతరం అభివృద్ధి చెందుతున్న సాంకేతిక ప్రపంచం నుంచి ప్రేరణ పొందేందుకు సహకారం అందించే ఒక వేదిక అన్నారు. రెండు రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో పలు పోటీలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో విటాప్-2024 టెక్ ఫెస్ట్ కన్వీనర్ డాక్టర్ శిబి చక్రవర్తి సేతురామన్ డాక్టర్ హరికిషన్ కొండవీటి, కో కన్వీనర్లు డాక్టర్ సుధా ఎల్లిసన్ మాతే, డాక్టర్ ఖదీర్ బాషా విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కో ఆర్డినేటింగ్ ఆఫీసర్ డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్